

అప్పులు వాస్తవం

కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ నేతలు నిప్పులు చెరిగారు. సంపద బూటకం, అప్పులు వాస్తవం అని అన్నారు. - 8లో



టోల్‌గేటు వద్ద ఉద్రిక్తత

లక్ష్మీపురం టోల్‌గేటు వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. లారీ అసోసియేషన్ ప్రతినిధులు ఆందోళన చేశారు. - 8లో

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌ల తొలగింపు

మందస: మందస మండలంలో పలు పంచాయతీలకు చెందిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారని మండల ఉపాధి హామీ పథకం ఏపీఓ హరికృష్ణ గురువారం తెలిపారు. మండలంలోని తాళ్లగురండి, బేతాళపురం, రాంపురం, నరియాపల్లి, మందస పొత్తంగి, భోగాపురం పంచాయతీలకు చెందిన తొమ్మిది మంది ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయని, వాటిని ఆయా ఫీల్డ్ అసిస్టెంట్లకు అందజేసినట్లు ఆయన తెలిపారు.

న్యూస్‌రీల్

రేపటి నుంచి పర్యావరణ వారోత్సవాలు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ప్రపంచ పర్యావరణ దినోత్సవం – 2025 సందర్భంగా ఈ నెల 31 నుంచి జూన్ 5 వరకు 'ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలన, భవిష్యత్ తరాల సంరక్షణ, పుడమి సంరక్షణ' అనే అంశంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీర్ కరుణశ్రీ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. శనివారం 6 నుంచి 10వ తరగతుల విద్యార్థులకు శ్రీకాకుళం న్యూ సెంట్రల్ స్కూల్ వేదికగా, ఇంటర్మీడియట్ విద్యార్థులకు జూన్ 4న శ్రీకాకుళం ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలురు), ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలికలు) వేదికగా వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. పచ్చదనం పరిరక్షణలో భాగంగా పైడిభీమవరం, టెక్కలి తదితర గ్రామాల్లో 5000 మొక్కలు నాటనున్నట్లు పేర్కొన్నారు. జూన్ 5న గ్రీన్ ర్యాలీ సమావేశాలను నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు.

24 కేజీల గంజాయి స్వాధీనం



నరసన్నపేట: మడపాం టోల్‌గేట్ వద్ద శ్రీకాకుళం టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం రాత్రి నిర్వహించిన తనిఖీల్లో భారీగా గంజాయి పట్టుబడింది. ఒడిశా రాష్ట్రం గంజాం ప్రాంతం నుంచి విశాఖ వైపు అక్రమంగా గంజాయిని తరలిస్తుండగా పోలీసులు నిఘా వేసి పట్టుకున్నట్లు తెలుస్తోంది. ఓ మహిళ నుంచి 14 కేజీలు, ఇదే ప్రాంతానికి చెందిన రంజిత్ అనే మరో వ్యక్తి నుంచి 10 కేజీలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. స్వాధీనం చేసుకున్న గంజాయిని నరసన్నపేట పోలీసులకు అప్పగించినట్లు తెలిసింది.

'మద్యం విక్రయాలతో రూ.811 కోట్లు ఆదాయం'



మాట్లాడుతున్న ఎక్సైజ్ ఏసీ రామచంద్రరావు

శ్రీకాకుళం క్రైమ్ : మద్యం విక్రయాల్లో అక్రమాలకు తావులేకుండా ప్రతి నిత్యం నిఘా పెడుతున్నామని, బెల్టుషాపులు పెడితే కేసులు నమోదు చేస్తామని, నవోదయం 2.0లో భాగంగా సారారహిత జిల్లాగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ (ఏసీ) పి.రామచంద్రరావు అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని 80 ఫీట్ రోడ్డు సమీపంలోని తన కార్యాలయంలో విలేకరులతో ఏసీ మాట్లాడారు. సగటున రూ.110 కోట్లు నెలకు టార్గెట్‌గా పెట్టుకున్నామని, రూ.104 కోట్లతో రీచ్ అయ్యి అక్టోబరు నుంచి రూ.811 కోట్లు ఆదాయం సంపాదించామన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు సంబంధించి 1537 కేసులు నమోదు చేసి 1462 మందిని అరెస్టు చేసి, 28 వాహనాలు సీజ్ చేశామన్నారు. సారాకు సంబంధించి 385 కేసుల్లో 270 మందిని అరెస్టు చేసి 4,133 లీటర్ల సారాయిని ధ్వంసం చేసి 15 వాహనాలు సీజ్ చేశామన్నారు. బెల్టుషాపుల వెనక లైసెన్సు దుకాణాదారులున్నారని బయటపడితే రూ. 5 లక్షలు అపరాధ రుసుం కట్టిస్తామన్నారు. అనధికార పర్మిట్ రూమ్‌లు లేవని, మద్యం దుకాణాల వద్ద బహిరంగంగా మద్యం సేవించిన వారివల్ల న్యూసెన్సు జరుగుతోందని, అలాంటివారిపై 111 కేసులు నమోదు చేశామన్నారు. ఎమ్మార్పీకి మించి అమ్మిన దుకాణాలపై చర్యలు తీసుకుంటామని, బార్లు సమయపాలన పాటించాలని అన్నారు. ఫిబ్రవరి 19 తర్వాత 130 కేసుల్లో 270 లీటర్ల నాటుసారా స్వాధీనం, 25000 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశామని, 114 మందికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించామన్నారు. గంజాయి కేసులు 3 నమోదు చేసి నలుగురిని అరెస్టు చేసి 40 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు.




దశాబ్దాల కలకు ప్రతిరూపం..

జగన్ హయాంలో..

పీహెచ్‌సీ కోసం లింగాలవలస గ్రామం దశాబ్దాల తరబడి ఎదురు చూసింది. వైఎస్సార్‌సీపీ హయాంలో గానీ ఆ ఊరి ఆశలు నెరవేరలేదు. టెక్కలి మండలం లింగాలవలసలో సుమారు రూ.2.30 కోట్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించారు. నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్న సమయానికి ఎన్నికలు రావడం...ఆ తర్వాత కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడం జరిగింది. ఇటీవలే ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. లింగాలవలసతో పాటు సార్లిగాం, సవరసార్లిగాం, రంగాపురం, మెట్టపేట, ఏనేటిపేట, సతివాడ, సన్యాసిపేట, ఆర్.వి.పురం, లక్ష్మీపురం, పోలవరం, గంగాధరపేట, సీలాపురం, వీఆర్ కె.పురం, బొరిగిపేట, తిర్లంగి, సీతాపురం తదితర గ్రామాల ఆరోగ్య సేవలకు ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆసరాగా నిలుస్తోంది.

ఇది వైఎస్ జగన్ మార్క్. - టెక్కలి



ఎంత తేడా బాబూ!

కబ్జా చేసి కల్యాణ మండపం ?

కూటమి పాలనలో

ఆమదాలవలస మండలంలోని అక్కులపేట గ్రామంలో 1973లో ఫ్యామిలీ ప్లానింగ్ సబ్ సెంటర్ ప్రారంభించారు. ఈ సెంటర్ సుదీర్ఘ కాలం సేవలు అందించింది. కొన్నేళ్ల కిందట అక్కులపేట గ్రామంలో పీహెచ్‌సీ కట్టాక.. ఈ భవనాన్ని విడిచిపెట్టి పీహెచ్‌సీలోకి వైద్య సిబ్బంది వచ్చేశారు. అయితే ఈ భవనంపై ఆ గ్రామానికి చెందిన కొంతమంది టీడీపీ నాయకుల కన్ను పడినట్లు సమాచారం. ఈ భవనాన్ని తొలగించి ఆ ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ప్రైవేటు కల్యాణ మండపం నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నట్లు ఆ గ్రామానికి చెందిన కొంత మంది వ్యక్తులు చెబుతున్నారు. ఈ ప్రక్రియకు ముహూర్తం కూడా పెట్టేశారు. దీన్ని ప్రభుత్వ రెవెన్యూ అధికారులు అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - ఆమదాలవలస





అక్కులపేటలో పురాతన ఫ్యామిలీ ప్లానింగ్ సబ్ సెంటర్ భవనం (ఇన్‌సెట్లో) భవనాన్ని నేలమట్టం చేసిన దృశ్యం

- కూటమి ప్రభుత్వంలో దయనీయ పరిస్థితులు
- స్వయంగా చంద్రబాబుకు విన్నవించుకున్నా ఇల్లు మంజూరు కాని పరిస్థితి
- వైఎస్ జగన్ హయాంలో 80వేలకు పైగా ఇళ్లు మంజూరు
- పేదల కోసం కొత్తగా 784 లే అవుట్ల ఏర్పాటు
- 33,123 మందికి ఇళ్ల స్థలాల పంపిణీ
- కూటమి ప్రభుత్వం ఏడాదిలో ఒకరికైనా స్థలం ఇవ్వని దుస్థితి
- గత ఇళ్లకు బిల్లులు చెల్లించని వైనం
- బిల్లులు లేక మధ్యలోనే ఆగిపోయిన నిర్మాణాలు



ఇల్లు లేదు.. బిల్లు రాదు..



ఏడాది పాలన ఇదేనా బాబూ..

అవి కేవలం స్థలాలు కావు...
మీ ఇల్లెక్కడ.. అంటే సమాధానం చెప్పుకోలేని నిరుపేదకు దక్కిన శాశ్వత చిరునామాలు.

అవి కేవలం ఇళ్లు కావు...
బతుకంతా రెక్కలు ముక్కలు చేసుకున్నా సెంటు జాగా కొనలేని వారికి అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిండుగుండెతో ఇచ్చిన ఆడపడుచు లాంఛనాలు.

అది రాజకీయం కానే కాదు..
ఇంటిపై ఎగురుతున్న జెండా రంగు చూడకుండా. బండి వెనుక రాసుకున్న నాయకుడి పేరుతో పట్టింపు లేకుండా వైఎస్ జగన్ సర్కారు పాటించి చూపించిన సంస్కారం.

ఇప్పుడా స్థలాల్లో మొండి గోడలు శిథిలమైపోయిన సామాన్యుడి స్వప్నాల్లా కనిపిస్తున్నాయి. శ్లాబు లేకుండా రోదిస్తున్న ఇళ్లు అడుగంటిపోయిన నగటు జీవి ఆశలా వెక్కిరిస్తున్నాయి. కొత్త ఇల్లు ఇవ్వకుండా, ఉన్నవాటికి బిల్లయినా మంజూరు చేయకుండా టీడీపీ ప్రభుత్వం ఏడాది గడిపేసింది. శాశ్వతంగా ఓ చిరునామా దొరుకుతుందన్న పేదవాళ్ల ఆశలకు అలవాటైన రీతిలో గండి కొట్టింది.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

కూటమి ఏడాది కాలక్షేపం చేసింది. గద్దెనెక్కిన తర్వాత ఇచ్చిన మాట తప్పడమే పనిగా పెట్టుకున్న ప్రభుత్వం పేదల ఇళ్ల విషయంలోనూ అదే సంప్రదాయాన్ని పాటించింది. కూటమి ప్రభుత్వంలో ఇంతవరకు ఒక్కరికీ స్థలం ఇవ్వలేదు. ఇక ఇళ్ల సంగతైతే చెప్పనక్కర్లేదు. కొత్తగా ఇళ్లు మంజూరు చేయకపోగా గత ప్రభుత్వంలో మంజూరై, నిర్మాణంలో ఉన్న ఇళ్లకు గ్రాంట్ కూడా ఇవ్వడం లేదు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సాధారణ, మధ్య తరగతి కుటుంబాలకు సొంతిళ్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని గత వైఎస్ జగన్ ప్రభుత్వం లేఅవుట్లు వేసి, స్థలాలిచ్చి, పక్కా ఇళ్లు మంజూరు చేసింది. దీంతో ఊళ్లకు ఊళ్లు వెలిశాయి. గతంలో మూడు పర్యాయాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలో కొత్తగా ఒక్క కాలనీ కూడా చంద్రబాబు కట్టించలేదు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన దాఖలాలు కూడా లేవు. ఈ సారి కూడా అదే పంథాలో వెళ్తున్నారు. మంచి చేయకపోగా వైఎస్ జగన్ ప్రభుత్వంలో వేసిన లేఅవుట్లను రకరకాల కారణాలతో రద్దు చేసి, ఇచ్చిన స్థలాలు వెనక్కి తీసుకుని, ప్రారంభించిన ఇళ్లకు నిధులు నిలిపివేసి చంద్రబాబు ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. అలా అని ఈ ప్రభుత్వం కొత్తగా ఎవరికైనా స్థలం ఇచ్చిందంటే అదీ లేదు. పోనీ ఇళ్లయినా మంజూరు చేసిందా అంటే అదీ లేదు. ఉన్నవి పోయి, కొత్తవి రాక దిక్కుతోచని స్థితిలో ప్రజలు ఉన్నారు.

వైఎస్ జగన్ ప్రభుత్వం హయాంలో...

వైఎస్ జగన్ ప్రభుత్వంలో జిల్లాలో 784 లేఅవుట్లు వేసి 33,123 మందికి ఇళ్ల స్థలాలు అందజేశారు. ఆ లేవుట్లలో మిగతా స్థలాలు కూడా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయి. అదే విధంగా 80,961 ఇళ్లు మంజూరు చేశారు. అర్హులైన, నిర్మించుకునేందుకు ఆసక్తి చూపినవారందరికీ పక్కా ఇళ్లు మంజూరు చేశారు. ఐదేళ్ల కాలంలోనే వైఎస్ జగన్ ఇదంతా చేస్తే.. చంద్రబాబు తన మొత్తం పాలనాకాలంలో ఇందులో నాల్గో వంతు కూడా చేయలేదు. ఈ సారైనా చేస్తారనుకుంటే అదీ లేదు. గతంలో మాదిరిగానే ఈసారి కూడా మొండి చేయి చూపిస్తున్నారు. కొత్తగా ఒక్కరంటే ఒక్కరికైనా ఇల్లు మంజూరు చేయలేదు. గతంలో మంజూరై, ఇళ్లు నిర్మించుకుంటున్న వారికి కనీసం బిల్లులు కూడా ఇవ్వడం లేదు. దాదాపు రూ.1081.85 కోట్లు మేర లబ్ధిదారులకు చెల్లించాల్సి ఉండగా ఏడాది కాలంలో కేవలం రూ.37కోట్లు మాత్రమే చెల్లించారు.

చంద్రబాబును స్వయంగా కోరినా..




ఈయన పేరు రత్నాల రాజేంద్ర. ఈయనది ఇచ్ఛాపురం మండలం ఈదుపురం గ్రామం. గత ఏడాది నవంబర్‌లో చంద్రబాబు ఈదుపురం వచ్చినప్పుడు ఇళ్లు కావాలని స్వయంగా దరఖాస్తు చేశారు. చంద్రబాబుకు ఇచ్చిన దరఖాస్తుకు ఇప్పటికీ మోక్షం కలగలేదు. ముగ్గురు అన్నదమ్ములు ఒకే ఇంటిలో ఉంటున్నారు. చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇల్లు కావాలని అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు. కానీ స్పందించడం లేదు. ఇప్పటికైనా ఇళ్లు మంజూరు చేసి, సొంతింటి కలను సాకారం చేస్తారని ఎదురు చూస్తున్నారు.

బిల్లు ఇచ్చి ఆదుకోండి..



గత ప్రభుత్వంలో ఇంటి నిర్మాణం ప్రారంభించాం. అప్పట్లో విడతల వారీగా బిల్లులు పడటంతో ఇంటి నిర్మాణం చేపట్టాం. దాదాపు రూ.లక్ష వరకు రావడంతో మిగతాది అప్పు చేసి ఇళ్లు కట్టుకున్నాం. ఇంతలో ఎన్నికలు వచ్చేశాయి. మిగతా బిల్లు కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం లేకుండా పోయింది. మిగతా పెండింగ్ బిల్లు ఇచ్చి ఆదుకోవాలి.
– సాడి రాధమ్మ, ముచ్చింద్ర, ఇచ్ఛాపురం రూరల్



ఇచ్చిన మాట కోసం..

ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం అంటే ఏమిటని అడిగితే.. వైఎస్ జగన్ కట్టిన ఈ కాలనీ చూపాల్సిందే. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ రామకృష్ణాపురం రెవెన్యూ పరిధిలో కోసంగిపురం కాలనీ ఇది. 49 ఎకరాల విస్తీర్ణంలో 2302 ఇళ్ల నిర్మాణం పూర్తయ్యింది. తర్లాకోటలో ఇచ్చిన సైటులో 322 ఇళ్లు, బొడ్డపాడు రెవెన్యూ పరిధిలో 386 ఇళ్లను కూడా మంజూరు చేశారు. - కాశీబుగ్గ

15 ఏళ్లు అద్దె ఇంటిలో ఉన్నాం



నా పేరు మేడపాటి మహాలక్ష్మి. మా ఆయన పేరు మేడపాటి సూర్యశేఖర్ రెడ్డి. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీకి తూర్పుగోదావరి జిల్లా నుంచి వచ్చి స్థిరపడ్డాం. ఫైనాన్స్ వ్యాపారి వద్ద గుమస్తాగా మా ఆయన పనిచేస్తున్నారు. మాకు ఇద్దరు పిల్లలు. మేము 15 ఏళ్లు అద్దె ఇంటిలో ఉన్నాం. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాకు ఇంటిని మంజూరు చేశారు. మాతోపాటు చాలా మందికి ఇళ్లు ఇచ్చారు. ఇళ్లన్నీ కలిపి ఊరుగా మారిపోయింది. జగనన్న కాలనీ మాకు శాశ్వత చిరునామా అయ్యింది.



తప్పిన మాటకు నిదర్శనం

నిర్లక్ష్యం ఎలా ఉంటుందని అడిగి తే.. ఈ కాలనీపై కూటమి సర్కారు చిత్తశుద్ధిని ఉదాహరణగా చెప్పొచ్చు. టెక్కలి జగతిమెట్ట సమీపంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీ ఇది. కూటమి ప్రభుత్వంలో ఈ కాలనీకి గ్రహణం పట్టింది. కాలనీలో జనం నివాసం ఉంటున్నా.. కనీస మౌలిక సదుపాయాలు కల్పించడం లేదు. రోడ్డు, మంచినీరు, వీధి దీపాల ఏర్పాటు ఊసు లేదు. - టెక్కలి రూరల్

నీటిలోనే నడక



జగనన్న కాలనీలోని మా ఇంటికి ముడుకులోతు నీటిలో నడుచుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. చిన్నపాటి వర్షం పడితే చాలు మా రోడ్డు చెరువులా తయారవుతుంది. దీంతో పాములు సైతం అక్కడికి చేరిపోతుండడంతో భయం పుడుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మా బాధలు తెలుసుకుని రోడ్లు, కాలువలు నిర్మించాలని కోరుతున్నాం.
– సాహుకారి లక్ష్మి, జగనన్న కాలనీ, టెక్కలి

వైఎస్ జగన్ ప్రభుత్వంలో మంజూరు చేసిన ఇళ్లు	అప్పట్లో పేదలకు ఇచ్చిన స్థలాలు	పేదల కోసం కొత్తగా వేసిన లేఅవుట్లు	వైఎస్సార్‌సీపీ హయాంలో పూర్తయిన ఇళ్లు	వైఎస్ జగన్ ప్రభుత్వంలో విడుదల చేసిన నిధులు	చంద్రబాబు ప్రభుత్వంలో మంజూరు చేసిన ఇళ్లు	చంద్రబాబు ప్రభుత్వంలో పేదలకు ఇచ్చిన స్థలాలు	జగన్ ప్రభుత్వంలో మంజూరై నిర్మాణంలో ఉన్న ఇళ్లకు, పూర్తి చేసుకున్న ఇళ్లకు చెల్లించాల్సిన బిల్లులు	ఇంతవరకు చంద్రబాబు ప్రభుత్వం చెల్లించిన బిల్లులు
80,961	33,123	784	36,708	రూ. 823.19కోట్లు	0	0	రూ.1081.85 కోట్లు	రూ.37 కోట్లు

వాయువ్య బంగాళాఖాతంలో వాయుగుండం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వాయువ్య బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడిందని విశాఖ వాతావరణ కేంద్రం నుంచి జిల్లాకు సమాచారం వచ్చింది. బాలాసోర్‌కు తూర్పుగా 180 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైనట్లు తెలిపారు. శుక్రవారం సాయంత్రానికి తీవ్రవాయుగుండంగా బలపడే అవకాశం ఉందన్నా రు. సాయంత్రం బెంగాల్–బంగ్లాదేశ్ మధ్య తీరం దాటనున్న తీవ్ర వాయుగుండం ఏర్పడే అవకాశం ఉంది. సాగర్ ఐలాండ్ ఖేపుపరా వద్ద తీరం దాటే అవకాశం ఉంది. 24 గంటల్లో ఉత్తర కోస్తాలో భారీ వర్షాలు పడే అవకాశం ఉంది. ఉత్తర కోస్తాలో గంటకు 40–50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు దక్షిణ కోస్తాలో కొన్నిచోట్ల భారీ వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు.

కోతకు గురైన తీరం

- ఎగసి పడుతున్న అలలు
- తీరానికే పరిమితమైన సంప్రదాయ తెప్పలు, వలలు



అలల ఉధృతికి ఒడ్డుకు కొట్టుకొచ్చిన తెప్పలు

వజ్రపుకొత్తూరు : అల్పపీడన ప్రభావంతో తీరం అల్లకల్లోలంగా మారింది. ఎగసి పడుతున్న కెరటాల ధాటికి తీరం కోతకు గురవుతోంది. వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేట వద్ద సముద్రం దాదాపు 90 మీటర్లు వరకు ముందుకు రావడంతో ఇసుక దిబ్బలు కరిగిపోయి సంప్రదాయ తెప్పలు, వలలు మునిపోయాయి. తీరం వెంబడి ఉన్న ఈత, ఇతర చెట్లు అలల ఉధృతికి కూలిపోతున్నాయి. దీంతో మత్స్యకారులు తమ వలలు, తెప్పలు, పడవలను సురక్షిత ప్రాంతానికి తరలించారు. పూడిలంక ఉప్పుటేరు వద్ద పడవలను లంగరు వేసి ఉంచారు. వలలు, సంప్రదాయ తెప్పలు, తీరంలోనే ఉండిపోవడం.. మరోవైపు చేపల వేట నిషేధం అమలవుతుండడంతో మత్స్యకారులు అవస్థలకు గురవుతున్నారు. ప్రభుత్వం స్పందించి అధిక వర్షాలు, తుఫాన్ల సమయంలో తమను ఆదుకోవాలని మత్స్యకారులు జి.శంభూరావు, మోహనరావు, లక్ష్మయ్య, రాజు తదితరులు కోరుతున్నారు.

నైరుతిపై సన్నద్ధత: కలెక్టర్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): జిల్లాలో నైరుతి రుతు పవనాలు వారం ముందుగానే ప్రవేశించిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి గురువారం నిర్వహించిన సన్నద్ధత సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. గత సంవత్సరం ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకొని, ఈసారి మరింత సమగ్రంగా, పటిష్టంగా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. విపత్తుల నిర్వహణ సంస్థ జారీ చేసిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌ఓపి) ప్రకారం కార్యాచరణను రూపొందించుకొని అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. ముందస్తు చర్యల్లో భాగంగా జిల్లా, డివిజన్, మండల స్థాయిలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి, వాటి ఫోన్ నంబర్లను ప్రజలకు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ సూచించారు. రైతు సేవా కేంద్రాల ద్వారా విత్తనాలు ఎరువులు పంపిణీకి ఏర్పాట్లు ముమ్మరం చేయాలని తెలియజేశారు. గత ఏడాది హిరమండలం–కొత్తూరు మధ్య రోడ్డు పైకి వరద నీరు వచ్చిన విషయాన్ని గుర్తు చేస్తూ, అలాంటి ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు.

అంతిమ సంస్కారాలకు అవస్థలు



పొలాల మీదుగా మృతదేహాన్ని తీసుకువెళ్తూ..

పాతపట్నం: మండలంలోని సింగుపురం గ్రామంలో ఉంటున్న దళితులు స్మశాన వాటిక లేక ఇబ్బంది పడుతున్నారని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు కోళ్ల చిన్నరావు, యడ్ల గోపి అన్నారు.

గురువారం సింగుపురం గ్రామంలో డప్పు కళాకారుడు మీసాల వెంకటరావు (38) అనారోగ్యంతో మృతి చెందాడు. మృతదేహాన్ని పంట పొలాల మీదుగా అంత్యక్రియలకు తీసుకువెళ్లాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో అధికారులకు విన్నవించామని, అయినా ఫలితం లేదని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్మశాన వాటికకు రహదారి నిర్మాణం చేపట్టాలని కోరారు.

చంద్రశేఖర పాహిమాం

ఒకటి కాదు రెండు కాదు.. ఏడు కిలోమీటర్ల జలయాత్ర. ఒకరు కాదు ఇద్దరు కాదు వందల సంఖ్యలో పడతులది కీలక పాత్ర. ఇచ్ఛాపురంలోని చంద్రశేఖరస్వామి ఆలయం జీర్ణోద్ధరణ కార్యక్రమంలో భాగంగా గురువారం జలయాత్ర నిర్వహించారు. బాహుదా నది జలాలను మహిళలు కలశాలతో ఏడు కిలోమీటర్లు ఊరేగించారు. - ఇచ్ఛాపురం



క్లుప్తంగా

మెళియాపుట్టి క్రీడాకారుడికి గోల్డ్‌మెడల్



అనిరుధ్

మెళియాపుట్టి : మండల కేంద్రం మెళియాపుట్టికి చెందిన పొట్నూరు అనిరుధ్ రోల్‌బాల్ (స్కేటింగ్)లో సత్తాచాటాడు. ఇటీవల జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో సత్తాచాటడంతో శ్రీలంక దేశంలోని మినువాంగోడలో జరుగుతున్న అంతర్జాతీయ పోటీలకు అవకాశం కలిగింది. గురువారం జరిగిన పోటీల్లో భారత్ తరఫున బంగారు పతకం సాధించాడు. అనిరుధ్‌కు తల్లిదండ్రులు నవీన్ కుమార్, మీనాక్షి, గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

మహిళ ఆత్మహత్య

సారవకోట : వాండ్రాయి గ్రామానికి చెందిన రాడ పార్వతమ్మ (59) అనారోగ్యంతో బుధవారం రాత్రి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుంది.భర్త ఆనందరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ అనిల్‌కుమార్ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం ఆస్పత్రికి తరలించారు. పార్వతమ్మకు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

చోరీ కేసులో ఇద్దరు అరెస్టు

రణస్థలం: పాతర్లపల్లి పంచాయతీలోని వెంకటేశ్వర కాలనీలో రేగాన ఉత్తరమ్మ ఇంట్లో ఈ నెల 25న బంగారం వస్తువులు చోరీకి గురయ్యాయని జె.ఆర్.పురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు అదే ఇంట్లో ఉన్న శైలు, అతని ప్రియుడు డి.దుర్గా ప్రసాద్‌లే దొంగతనం చేసినట్లు గుర్తించి అరెస్టు చేసినట్లు ఎస్సై ఎస్.చిరంజీవి తెలిపారు. నిందితులకు వచ్చే నెల 11 వరకు కోర్టు రిమాండ్ విధించిందని చెప్పారు. బంగారాన్ని రికవరీ చేశామని తెలిపారు.

బాడీబిల్డింగ్ పోటీల్లో ప్రతిభ



సిల్వర్‌మెడల్ సాధించిన శివకుమార్

కాశీబుగ్గ: అండమాన్ నికోబార్ దీవుల్లోని ల్యాండ్ పోర్టుబ్లెయిర్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో పలాస–కాశీబుగ్గకు చెందిన ఎం.శివకుమార్ సత్తాచాటాడు. మిస్టర్ అండమాన్ హంట్ విభాగంలో 170 కేటగిరీలో ద్వితీయ స్థానం కై వసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా విజేతలను సిల్వర్ మెడల్‌తో సత్కరించారు. ఈ సందర్భంగా జంటపట్టణాల బాడీబిల్డర్స్ గురువారం అభినందనలు తెలిపారు.

హెచ్‌ఎంలకు బదిలీ ఉత్తర్వులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉపాధ్యాయ సాధారణ బదిలీల్లో భాగంగా గ్రేడ్–2 ప్రధానోపాధ్యాయుల బదిలీల ప్రక్రియ పూర్తయింది. ఆప్షన్ ప్రకారం ఎంచుకున్న స్కూళ్లకు బదిలీ చేస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్తర్వులు అందుకున్న హెచ్‌ఎంలు విధుల్లో చేరాలని డీఈఓ తిరుమల చైతన్య ఆదేశించారు.

హెడ్ కానిస్టేబుల్‌పై దాడి

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని మంగువారితోట లెప్రసీ కాలనీ వద్ద మత్తులో ఉన్న యువకులు ఓ హెడ్‌కానిస్టేబుల్‌పై దాడి చేశారు. వారు గంజాయి మత్తులో ఉన్నారా.. లేదంటే మద్యం మత్తులోనే దాడికి పాల్పడ్డారా అన్నది తెలియాల్సి ఉంది. శ్రీకాకుళం ఒకటో పట్టణ ఏఎస్ఐ రాంబాబు, స్థానికులు చెప్పిన వివరాల మేరకు.. జిల్లా క్రైమ్ రికార్డ్ బ్యూరో (డీసీఆర్బీ) విభాగంలో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న త్రినాథ్ గురువారం రాత్రి విధులు ముగించుకుని లెప్రసీ కాలనీలో ఉన్న తన ఇంటికి బయల్దేరాడు. మంగువారి తోట వద్ద కాలనీలో వెళ్తుండగా నలుగురు యువకులు మత్తులో రోడ్డుపై న్యూసెన్సు చేస్తున్నారు. ఈ క్రమంలో బండిపై వెళ్తున్న హెచ్‌సీ త్రినాథ్‌కు ఓ యువకుడి చేయి తగలడంతో 'ఈ సమయంలో ఇలా చేస్తున్నారేంటి' అని ప్రశ్నించారు. దీంతో నలుగురు యువకులు హెచ్‌సీతో వాగ్వాదానికి దిగారు. ఒక్కసారిగా దాడికి ఎగబడ్డారు. ఈ పరిణామం నుంచి తేరుకునేలోపే హెచ్‌సీకి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఒకటో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లారు. గాయపడిన త్రినాథ్‌ను రిమ్స్‌కు తరలించారు. ఈ ఘటనపై ఎంఎల్‌సీ అయ్యిందని రిమ్స్ ఔట్‌పోస్ట్ అధికారులు నిర్ధారించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



ప్రమాణ స్వీకారం చేస్తున్న అనుబంధ సంఘాల కన్వీనర్లతో వైఎస్సార్ సీపీ నేతలు కుంభా రవిబాబు, ధర్మాన కృష్ణదాస్, తమ్మినేని సీతారాం, సీదిరి అప్పలరాజు, పిరియా విజయ, పేరాడ తిలక్, చింతాడ రవికుమార్ తదితరులు

సంపద బూటకం.. అప్పులు వాస్తవం

- సూపర్ దగా పాలన ఇది
- కూటమి సర్కారుపై వైఎస్సార్‌సీపీ నేతల మండిపాటు
- నరసన్నపేట నియోజవకర్గ అనుబంధ సంఘాల కమిటీల ప్రమాణ స్వీకారం

నరసన్నపేట :

ఏపీలో సంపద సృష్టిస్తామని.. మహిళలు, రైతులు, యువత ఇలా అన్ని వర్గాలను ఆదుకుంటామని ఎన్నికల ముందు గొప్పలు చెప్పిన కూటమి నాయకులు ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా సంపద సృష్టించకపోగా ఎన్నడూ లేని విధంగా రూ.1.53 లక్షల కోట్లు అప్పులు చేశారని, ఇంత కన్నా దగా పాలన మెరెక్కడా చూడలేదని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు కుంభా రవిబాబు ధ్వజమెత్తారు. ఈ 11 నెలల పాలనలో ఒక్క పైసా సంపద సృష్టి లేదని, సంపద సృష్టి పేరిట ప్రజలను సీఎం చంద్రబాబు మోసగించారని మండిపడ్డారు. రాగద్వేషాలకు అతీతంగా ఉంటామని ప్రమాణం చేసి అందుకు విరుద్ధంగా పాలన చేస్తున్నారని విమర్శించారు. నరసన్నపేటలో జాతీయ రహదారికి ఆనుకొని మేఘనా కన్వెన్షన్‌లో గురువారం నరసన్నపేట నియోజకవర్గ వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల కమిటీల ప్రమాణ స్వీకారోత్సవం పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణ చైతన్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన కమిటీలకు నాయకులు దిశా నిర్దేశం చేశారు. కూటమి పాలనపై ఏడాదిలోనే ప్రజల నుంచి వ్యతిరేకత వస్తోందని రవిబాబు అన్నారు. హింస, దౌర్జన్యం, అత్యాచారాలు, హత్యలు, అక్రమ కేసులు, అక్రమ అరెస్టులతో పాలన సాగుతోందని దుయ్యబట్టారు. ఈ దశలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు మరింత బాధ్యతగా ఐక్యంగా ఉండాలన్నారు. పార్టీ శ్రేయస్సును కాంక్షిస్తూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా చేసేందుకు ప్రతిఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని సూచించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, టెక్కలి, ఆమదాలవలస సమన్వయకర్తలు పేరాడ తిలక్, చింతాడ రవికుమార్ తదితరులు మాట్లాడుతూ కార్యకర్తలకు దిశ నిర్దేశం చేశారు. కూటమి పాలనను ఎండగట్టారు. కార్యక్రమంలో ఎంపీపీలు ఆరంగి మురళి, వాన గోపి, వైఎస్సార్ సీపీ నాయకులు కరిమి రాజేశ్వరరావు, చింతు రామారావు, ముద్దాడ బైరాగి నాయుడు, బగ్గు రామకృష్ణ, నాలుగు మండలాలకు చెందిన ప్రధాన నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

కలిసికట్టుగా పనిచేయాలి..



ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నంత మాత్రాన అసమర్థులంకాదు. బలహీనులం అసలే కాదు. మన రోజు వచ్చినప్పుడు తడాఖా చూపించాలి. అంతవరకూ కలసికట్టుగా పని చేయాలి. జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీకి మంచి నాయకత్వం ఉంది. పూర్వ వైభవం తప్పక వస్తుంది.అన్ని రంగాల్లోనూ కూటమి ప్రభుత్వం విఫలమైంది. చంద్రబాబు సొంత మామనే వెన్నుపోటు పొడిచి అధికారంలోకి వచ్చారు. ఇప్పుడు రాష్ట్ర ప్రజలందరికీ వెన్నుపోటు పొడిచి అధికారం సాధించారు. అధినేత జగన్ అనుమతిస్తే భవిష్యత్తులో నరసన్నపేట అభ్యర్థిగా కృష్ణ చైతన్య పోటీ చేస్తారు.

– ధర్మాన కృష్ణదాస్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

అంతా అక్రమమే..



సూపర్ సిక్స్ అంటూ అధికారంలోకి వచ్చిన కూటమి డూపర్ సిక్స్‌లా మారింది. సంపద సృష్టి పేరిట జిల్లాలో ఇసుక కొల్లగొడుతున్నారు. మద్యం ఏరుల్లా పారిస్తున్నారు. ఈ 11 నెలల కాలంలో లాటీలు, హత్యలు పెరిగాయి. కోర్టులు మొట్టికాయలు పెడుతున్నా.. అక్రమ కేసులు బనాయిస్తూ అక్రమంగా అరెస్టులు చేస్తున్నారు. ఇంతకు ఇంత బదులు తీర్చుకోవడానికి కూటమి నాయకులు సిద్ధంగా ఉండాలి.

– తమ్మినేని సీతారాం, మాజీ స్పీకర్, శ్రీకాకుళం పార్లమెంట్ సమన్వయకర్త

నిజాం పాలనలా..



కూటమి పాలన నిజాం పాలనను తలపిస్తోంది. నిజాం పాలనను మించి పన్నులు విధిస్తున్నారు. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే, జిల్లాలో మంత్రులు, రాష్ట్రంలో ముఖ్యమంత్రి ట్యాక్స్‌లు వేస్తూ ప్రజల నడ్డి విరుస్తున్నారు. గత ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలు తీసుకువచ్చి ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పని చేశాం. ఇప్పుడా పరిస్థితి లేదు.

– డాక్టర్ సీదిరి అప్పలరాజు, మాజీ మంత్రి, రాష్ట్ర డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు

వికృత చేష్టలు.. అవినీతి ఆరోపణలు

- వెలుగులోకి వస్తున్న సన్యాసిరావు లీలలు
- వీడియో ఘటనపై భయాందోళనలో మహిళా ఉద్యోగులు
- సమగ్ర విచారణ జరపాలని డిమాండ్

పొందూరు:

కూటమి ప్రభుత్వం వచ్చాక మహిళలకు రక్షణ లేకుండాపోతోంది. ఇందుకు పొందూరు రెవెన్యూ కార్యాలయంలో గురువారం జరిగిన ఘటనే సాక్ష్యంగా నిలుస్తోంది. ఇక్కడి వాష్ రూమ్‌కు వెళ్లిన ఓ మహిళా రెవెన్యూ ఉద్యోగిని వీడియో తీస్తూ కంప్యూటర్ ఆపరేటర్ సువ్వారి సన్యాసిరావు పట్టుబడిన సంగతి తెలిసిందే. సదరు మహిళా ఉద్యోగి వెంటనే స్పందించి ఫోన్‌లో వీడియోను డిలీట్ చేయించి తహశీల్దార్‌కు, పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. వాస్తవానికి సన్యాసిరావు అవినీతిపరుడనే, మహిళలను వేధిస్తాడనే ఆరోపణలు ఉన్నాయి. తన మాట వినకపోతే పనులు చేయకుండా విసిగించడమే కాకుండా రాజకీయంగా పలుకుబడి ఉందని బెదిరిస్తూ మరింత రెచ్చిపోయేవాడు. ఈ విషయమై గతంలో కొంత మంది మహిళా ఉద్యోగులు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని, సన్యాసిరావు వికృత చేష్టలకు అంతులేకుండా పోయిందని మహిళా ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సన్యాసిరావు ల్యాప్‌టాప్‌లో మరిన్ని వీడియోలు ఉండొచ్చని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకొని సమగ్ర విచారణ జరపాలని అధికారులను కోరుతున్నారు.



అంతా తానై..

తహశీల్దార్ వద్దకు ఏ ఫైల్ వెళ్లాలన్నా తన వద్దకు రావాల్సిందేనన్న స్థాయికి సన్యాసిరావు వెళ్లిపోయాడని కొందరు చెబుతున్నారు. రికార్డులు తారుమారు చేసి మ్యుటేషన్లు జరిపించడం కోసం రూ.లక్షల్లో లంచాలను రియల్టర్ల నుంచి తీసుకునేవాడని ఆరోపణలు ఉన్నాయి. 1–బీ ద్వారా బ్యాంకు నుంచి వ్యవసాయ రుణాలు పొందే సౌలభ్యాన్ని ఆసరాగా చేసుకుని కొంత మందికి లేని భూములకు 1–బీ సృష్టించేవాడని, వీటి ద్వారా రుణాలు పొందడంలో అక్రమాలకు సహకరించేవాడని సమాచారం. దేవదాయ భూముల రికార్డులు మార్చి అక్రమార్కులకు రెవెన్యూ పత్రాలు కట్టబెట్టడంలో ప్రధాన కారకుడు సన్యాసిరావు అనే ఆరోపణలు ఉన్నాయి. వీటిపై సమగ్ర విచారణ జరిపిస్తే మరిన్ని వాస్తవాలు వస్తాయని పలువురు అంటున్నారు.

అవార్డుకు అర్హుడా?

గత ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉద్యోగులకు ఇచ్చే అవార్డును సన్యాసిరావు తీసుకోవడం గమనార్హం. అవినీతి ఆరోపణ లు ఉన్నప్పటికీ సన్యాసిరావు పేరు జాబితాలో చేర్చడంతో అప్పట్లో అంతా విస్తుపోయారు. ప్రస్తుతం మహిళల పట్ల అసభ్య వీడియోలు చిత్రీకరిస్తూ పట్టుబడటంతో అవార్డును వెనుక్కు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

సమర్థంగా డి–అడిక్షన్ కేంద్రాల నిర్వహణ

- ఎక్సైజ్ అధికారుల సమీక్షలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): అక్రమంగా తయారవుతున్న మద్యం(ఐడీ లిక్కర్) వల్ల తలెత్తుతున్న ఆరోగ్య, ఆర్థిక సమస్యలపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన చర్యలు, మద్యం బారిన పడిన కుటుంబాలకు ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పనపై ఎక్సైజ్ శాఖ అధికారులతో గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్రమ మద్యం వల్ల బలహీన వర్గాలపై తీవ్ర ప్రభావం పడుతోందన్నారు. దీని తయారీకి ఉపయోగించే ముడి సరుకులపై నియంత్రణ పెట్టాలన్నారు. ఇందులో ప్రధాన పాత్ర పోషించే వ్యక్తులను గుర్తించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీ–అడిక్షన్ కేంద్రాల సమర్థ వినియోగంపై జిల్లాలో ఏర్పాటు చేసిన కేర్ కమిటీ (కమిటీ ఫర్ ఆల్కహాల్ అవేర్నెస్ రెస్పాన్సివ్ ఎడ్యుకేషన్) ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యకలాపాలను సమీక్షించారు. ఇప్పటివరకు ఈ కమిటీ ద్వారా 16 అవగాహన కార్యక్రమాలు నిర్వహించగా 595 మంది పాల్గొన్నట్లు గుర్తించారు.



ఎక్సైజ్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డీ–అడిక్షన్ కేంద్రాన్ని ఒకసారి సందర్శించినట్లు కలెక్టర్ గుర్తు చేసుకున్నారు. ఇందులో తొమ్మిది మంది చేరగా ఏడుగురు విజయవంతంగా పునరావాసం పొందినట్లు అధికారులు వెల్లడించారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఐడీ మద్యం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రతి నెల 2, 4వ శనివారాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ రామచంద్రరావు, అదనపు ఎస్పీ కె.వి.రమణ, డీఎస్పీ సీహెచ్ వివేకానంద, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రహసనంగా పదోన్నతుల కౌన్సెలింగ్

- 83 హెచ్‌ఎం పోస్టులను ఎస్‌ఏలతో భర్తీ చేసేందుకు నిర్ణయం
- ఉదయం పిలిచి సాయంత్రం మొదలుపెట్టిన ప్రక్రియ
- కూటమి ప్రభుత్వం, అధికారుల తీరుపై మండిపడిన ఉపాధ్యాయులు

శ్రీకాకుళం న్యూకాలనీ:

కూటమి ప్రభుత్వం విద్యాశాఖ పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులపై కక్షపూరితంగా వ్యవహరిస్తోంది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అనువనువునా వారిని అవమానించేలా వ్యవహరిస్తోంది. తాజాగా గురువారం శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేదికగా ప్రధానోపాధ్యాయులు పదోన్నతుల కౌన్సెలింగ్ పేరిట ఉదయం పిలిచి, సాయంత్రం వరకు మొదలుపెట్టకపోవడంతో వారు అల్లాడిపోయారు. తమ పట్ల ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు అనుసరిస్తున్న తీరుపై మండిపడ్డారు.

అసలేం జరిగిందంటే..!

జిల్లా పరిషత్‌లో 80, మున్సిపల్ 2, మున్సిపల్ కార్పొరేషన్‌లో ఒకటి కలిపి మొత్తం 83 ప్రధానోపాధ్యాయుల ఖాళీ పోస్టులను అర్హులైన స్కూల్ అసిస్టెంట్లు, తత్సమాన కేటగిరి ఉపాధ్యాయులతో భర్తీ చేయాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించి సీనియారిటీ జాబితాను తయారు చేసి, అభ్యంతరాలను స్వీకరించి, ప్రొవిజినల్ సీనియారిటీ జాబితాను రూపొందించారు. 1:2 నిష్పత్తిలో 166 మంది ఉపాధ్యాయుల ఒరిజినల్ సర్టిఫికెట్లు, సర్వీస్ రిజిష్టర్లను ఈనెల 27న డీఈఓ నేతృత్వంలో వెరిఫికేషన్ చేశారు. తాజాగా పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకని చెబుతూ.. శుక్రవారం పదోన్నతల కౌన్సెలింగ్ కోసం ఉదయం 8 గంటలకు శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్దకు చేరుకోవాలని డీఈఓ తిరుమల చైతన్య సంబంధిత ఉపాధ్యాయులకు సూచించారు.



పదోన్నతులకు హాజరైన టీచర్లకు సూచనలిస్తున్న డీఈఓ తిరుమల చైతన్య



రాత్రి 9 గంటల వరకు కొనసాగిన కౌన్సెలింగ్ ప్రక్రియ

సాయంత్రం వరకు నిరీక్షణ..

ఉదయమే పాఠశాలకు చేరుకున్న ఉపాధ్యాయులు వేచి ఉండక తప్పలేదు. ఆన్‌లైన్‌లో సాంకేతిక సమస్యల పేరిట సాయంత్రం వరకు నిరీక్షించేలా చేశారు. ఈ మధ్యలో పలు సూచనలు పేరిట డీఈఓ, ఇతర అధికారులు కాలక్షేపం చేస్తూ వచ్చారు. కనీసం భోజనం చేసేందుకు కూడా అర్ధగంట సమయం ఇవ్వకుండా పాఠశాలకే వారిని పరిమితం చేయడంతో ఆకలితో తల్లడిల్లిపోయారు. ఎట్టకేలకు సాయంత్రం 6 గంటల తర్వాత మొదలైన ఈ పదోన్నతి కౌన్సెలింగ్ ప్రక్రియ రాత్రి 9.15 వరకు కొనసాగింది. ఆన్‌లైన్‌లో చేపట్టాల్సిన పదోన్నతి కౌన్సెలింగ్‌ను మాన్యువల్‌గా చేపట్టారు. అధికారులు తీరుపై ఉపాధ్యాయ సంఘాల నాయకులు తీవ్రంగా మండిపడుతున్నారు. ఉదయం పిలిచి రాత్రి 9 వరకు తమను నాలుగు గోడలకు పరిమితం చేసి, వేధించడం ఎంతమాత్రం తగదని మహిళా ఉపాధ్యాయినులు ఆక్రోశం వెల్లగక్కారు. కాగా, 83 హెచ్‌ఎం ఖాళీ పోస్టులకు కౌన్సెలింగ్ చేపట్టి, నియామక ఉత్తర్వులు ఆన్‌లైన్‌లో చేరవేసేలా చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం డీవైఈఓ ఆర్.విజయకుమారి, జి.రాజేంద్రప్రసాద్, పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, డీఈఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టోల్‌గేటు వద్ద ఉద్రిక్తత

- ఇరవై గంటలకు పైగా లారీని నిలిపివేసిన టోల్ సిబ్బంది
- రంగంలోకి దిగిన రాష్ట్ర స్థాయి లారీ అసోషియేషన్లు
- పలాస మండలం లక్ష్మీపురం టోల్ గేటు వద్ద నిరసనలు
- టోల్‌గేటు కాంట్రాక్ట్ రద్దు చేయాలని డిమాండ్

కాశీబుగ్గ: పలాస మండలం లక్ష్మీపురం టోల్‌గేటులో పోలీసులతో కలిసి సిబ్బంది అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని రాష్ట్ర లారీ ఓనర్ల అసోసియేషన్ సభ్యులు ఆరోపించారు. వారంతా కలిసి గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించి రాష్ట్ర వ్యాప్తంగా బంద్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు. వివరాల్లోకి వెళ్తే.. పలాస మండలం లక్ష్మీపురం జాతీయ రహదారి టోల్‌గేటు వద్దకు బుధవారం కాకినాడకు చెందిన లారీ వచ్చింది. లారీ ఓవర్ లోడుతో ఉందని, అదనంగా డబ్బులు కట్టాలని టోల్ సిబ్బంది కోరగా.. ఏ టోల్‌ప్లాజాలో లేని ఓవర్ లోడ్ లక్ష్మీపురం టోల్‌ప్లాజాలో ఎలా ఉందని డ్రైవర్ రమేష్ లంకా ప్రశ్నించారు. దీంతో అదనంగా చెల్లిస్తేనే విడిచిపెడతామని లేకుంటే విడిచిపెట్టబోమని వాహనాన్ని అడ్డుకున్నారు. అదనంగా ఉంటే అపరాధ రుసుం చెల్లిస్తామని డ్రైవర్ చెప్పినా వినకుండా డ్రైవర్‌పైకి కొట్టడానికి వెళ్లడంతో ఆయన 112కు కాల్ చేసి పోలీసుల సహకారం కోరారు. కాశీబుగ్గ పోలీసులు సైతం డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నారని స్టేషన్‌కు తీసుకుని వెళ్లారు. కానీ పరీక్షలో తాగలేదని తేలడంతో విడిచిపెట్టి టోల్‌ప్లాజా వద్ద గొడవ చేశారని పోలీసులు రూ.1030 అపరాధ రుసుం కట్టించుకున్నారు. దీనిపై డ్రైవర్ స్పందిస్తూ తన తప్పు లేకున్నా టోల్‌గేటు సిబ్బంది అదనంగా డబ్బులు అడుగుతున్నారని, పోలీసులను సంప్రదిస్తే వారు కూడా టోల్ సిబ్బందికే సహకరించారని తెలిపారు. దీనిపై అసోసియేషన్ సభ్యులకు సమాచారం అందించడంతో గురువారం ఉదయం లక్ష్మీపురం టోల్‌ప్లాజా వద్దకు వందలాది లారీలకు సంబంధించిన వివిధ అసోషియేషన్ సభ్యులు చేరుకున్నారు. టోల్‌ప్లాజాలో డిస్‌ప్లే లేకుండా అదనపు బరువు చెబుతూ అక్రమంగా వసూళ్లకు పాల్పడుతున్నారని, ఇవ్వని వారిపై దాడి చేయడానికి వస్తున్నారని, బరువు తూయకుండా అదనపు లోడ్ అని డబ్బులు తీసుకుంటే ఎలా ఇస్తామని ప్రశ్నించారు. మీడియా, కాశీబుగ్గ పోలీసుల సమక్షంలో లారీ బరువు తూయగా అదనపు లోడ్ లేదని తేలడంతో టోల్‌ప్లాజా సిబ్బంది, అధికారులను నిలదీశారు. తక్షణమే విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేపట్టి లక్ష్మీపురం టోల్‌ప్లాజా కాంట్రాక్ట్ రద్దు చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా లారీలు సరుకు రవాణాతో ఉపాధి పొందుతుంటే ఈ ప్రభుత్వం ఇబ్బందులు పెట్టడానికి చూస్తోందని ఆరోపించారు. టోల్‌ప్లాజా వద్ద టైర్ల బట్టి రూ.800లు ఫాస్టాగ్‌లో తీసుకుంటే అదనపు లోడ్ అని ఎలాంటి రిసీప్ట్ లేకుండా మరో రూ.800 వసూలు చేస్తున్నారని, వేలాది మంది డ్రైవర్‌లు ఇక్కడ బాధితులుగా మిగిలిపోతున్నారని అన్నారు. అనంతరం కాశీబుగ్గ డీఎస్పీ వెంకటప్పారావును కలిసి ఫిర్యాదు చేశారు. లక్ష్మీపురం టోల్‌గేటు వద్ద దందా జరుగుతోందని, చర్యలు చేపట్టకపోతే రాష్ట్ర వ్యాప్తంగా వేలాది లారీలతో టోల్‌ప్లాజాను చుట్టుముడతామని హెచ్చరించారు.



టోల్‌గేటు మధ్యకు వచ్చిన లారీ డ్రైవర్లతో మాట్లాడుతున్న ఏఎస్ఐ గోవిందరావు



అదనపు లోడ్ లేకపోవడంతో పోలీసుల సమక్షంలో విడిచిపెట్టిన లారీ

టోల్‌ప్లాజాలో దందా..



లక్ష్మీపురం టోల్‌ప్లాజా వద్ద కాశీబుగ్గ పోలీసులకు ప్రతి నెలా రూ.50వేలు లంచం ఇస్తున్నారు. పలాస–కాశీబుగ్గ పట్టణంలోకి లారీ వెళ్తే రూ.వందలలో వసూళ్లు చేస్తున్నారు. టోల్‌ప్లాజా వద్ద లారీలలో అదనపు లోడ్ ఉందని ఎక్కడా లేని విధంగా రోజు లేకుండా నగదు వసూలు చేస్తున్నారు. ఏ ఒక్కరు ప్రశ్నించినా కొట్టడానికి వస్తున్నారు. ప్రస్తుతం లక్ష్మీపురం టోల్‌ప్లాజా కాంట్రాక్ట్ రద్దు చేయాలని కోరుతున్నాం. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తాం. ఆపదలో పోలీసుల సాయం కోరితే తిరిగి మాకే ఫైన్ వేస్తారా. ఇది ఇక్కడితో విడిచిపెట్టం. రాష్ట్ర వ్యాప్తంగా పోరాడుతాం.

– పీజేఆర్ఎస్ మహారథ, న్యూలారీ అసోసియేషన్, అధ్యక్షుడు, విజయవాడ